## సెల్ఫ్ విజార్డ్ డ్రామా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** సిద్దిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరా నగర్‌లో మంగళవారం జిల్లాస్థాయి స్పెల్ నిజార్డ్, డ్రామా కాంపిటీషన్స్ నిర్వహించారు. జిల్లాలోని 26 మండలాల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎల్టా(ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్), తెలంగాణ, ఎస్సీఆర్టీ(స్టేట్ కౌన్సిల్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైన వారి వివరాలు ఇలా ఉన్నాయి. స్పెల్ విజార్డ్ విభాగంలో బి.సాక్షిత జడ్పీ పాఠశాల(తొగుట), కే.శ్రీజ టిఎస్ మోడల్ స్కూల్(లచ్చపేట), డ్రామా విభాగంలో జడ్పీ ఇందిరానగర్ పాఠశాల విద్యార్థుల బృందం, టిఎస్ మోడల్ స్కూల్ లచ్చపేట విద్యార్థుల బృందం ఎంపికయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ రాజు, ప్రభాకర్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా ఎల్టా అధ్యక్షులు పంజా రాజమల్లు, ఎస్ఏ పి.రామస్వామి, బి.భాస్కర్, ఎస్‌బిఐ ప్రతినిధులు బీమా, సుమిత్, ఎం.డి.యూసుఫ్,అశ లక్ష్మణ్, విష్ణువర్ధన్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి,రవి, భాస్కర్, వెంకట్‌రెడ్డి, రవీందర్, మధు, ప్రశాంత్, అర్.జ్యోతి, కిరణ్‌మై, నర్మదా తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## అందుబాటులో ఎరువులు : జిల్లా వ్యవసాయాధికారి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** రైతులకు అందుబాటులో సరిపడా ఎరువులను ఉంచి నట్లు జిల్లా వ్యవసాయధికారి గోవింద్ తెలిపారు. మంగళవారం మండల పరిధి చందంపేట, జంగరాయి, చిన్నశంకరంపేటలోని సొసైటీలను పరిశీలించి, పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులకు సరిపోయే ఎరువులను సహకార సంఘం గోదాముల్లో అందుబాటులోనే ఉన్నాయన్నారు. మండల వ్యవసాయాధికారులు సర్వే నెంబర్ల ప్రకారం పంట వివరాలను నమోదు చేస్తారని, వ్యవసాయ భూములలో తప్పకుండా పంటలను వేయాలన్నారు. రానున్న రోజుల్లో పంటలు పండిస్తున్న భూములకు మాత్రమే ప్రభుత్వం సహాయం అందిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 22 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను, రైతులకు అందించామన్నారు. గత సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 2.6 లక్షల ఎకరాల్లో వరి వేల ఎకరాల్లో జొన్న, 2500 ఎకరాల్లో మొక్కజొన్న, 100 ఎకరాలలో వేరుశనగా పంటలను వేయగా, ఈ ఏడాది 800 ఎకరాలు తక్కువగా రైతులు పంటలను వేశారన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్ ఉన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అగ్రవాల్

## దానంపల్లిలో పర్యటించిన జిల్లా అదనపు కలెక్టర్

**చేర్యాల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** చేర్యాల మండలం దానంపల్లి గ్రామాన్ని మంగళవారం సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సందర్శించారు. గ్రామంలో ఉన్న డంపింగ్ ద్వారా ఎరువు తయారుచేసే విధానాన్ని, పొడిచెత్త ద్వారా గ్రామపంచాయతికి వచ్చిన ఆదాయం గురించి ఆరా తీశారు. పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి మొక్కల పెంపకం బాగుందని తెలిపారు. మిషన్ భగీరథ నీళ్లట్యాంకర్, గ్రామపంచాయతీ రికార్డులు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అంగన్‌వాడీలో పిల్లలకు అందించే పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించారు. అంతకుముందు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని పదవతరగతి విద్యార్థులతో మాట్లాడారు. అదనపు కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు వెంటనే జవాబులు తెలపడంతో విద్యార్థులను అభినందించి కె.వైష్ణవి అనే విద్యార్థిని శాలువాతో సత్కరించారు. ప్రతి రోజు పదో తరగతి విద్యార్థులు స్పెషల్ క్లాస్‌కి రావాలని అందరూ 100శాతంతో పాసై 10/10 జిపిఏ సాధించి సిద్దిపేట జిల్లాను ప్రథమ స్దానంలో నిలపాలని కోరారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు చుట్టుపక్కల పరి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా పంచాయతి అధికారి దేవకిదేవి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీరామ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, డివిజన్ పంచాయతి అధికారి మల్లి కార్జున్‌రెడ్డి, ఇన్‌చార్జీ ఎంపిడీవో మహబూబ్ అలి, మండల విద్యాశాఖ అధికారి మొగుళ్ళ నర్సింహారెడ్డి, ఏపివో మంజుల, ప్రధానోపాధ్యా యులు పి.ప్రవీణ, ఉపాధ్యాయుల బృందం, సిఆర్పీ కనకరాజు పాల్గొన్నారు.

## డిప్యూటీ కలెక్టర్‌గా ఆర్‌డిఓకు పదోన్నతి

**సంగారెడ్డి, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త:** జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారి కె.వెంకారెడ్డి బదిలీ అయ్యారు. శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్‌గా వెంకారెడ్డికి పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు బదిలీ చేశారు. వెంకారెడ్డిని జహీరాబాద్ ఉంచి బదిలీ చేసిన అధికారులు జహీరాబాద్ ఆర్‌డిఓగా ఇంతవరకు ఎవరిని ఇక్కడికి బదిలీ చేయలేదు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వెంకారెడ్డికి పదోన్నతి కల్పిస్తూ శేరిలింగంపల్లికి బదిలీ చేసినట్లు తెలుస్తోంది.

**ఎక్సైజ్ సిఐ అశోక్‌కుమార్ బదిలీ...**

జహీరాబాద్ డివిజన్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.అశోక్‌కుమార్‌ను బదిలీ చేసి ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణఖేడ్ ఎక్సైజ్ సిఐగా అశోక్‌కుమార్‌ను బదిలీ చేశారు. అశోక్‌కుమార్ స్థానంలో ఇబ్రహింపట్నం ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్‌రెడ్డిని జహీరాబాద్‌కు బదిలీ చేశారు. అశోక్‌కుమార్ గత 5 సంవత్సరాలుగా జహీరాబాద్ ఎక్సైజ్ సిఐగా బాధ్యతలు నిర్వహించారు.

## కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ ప్రతిభ హైస్కూల్



కుంగ్‌ఫూలో ఛాంపియన్‌గా నిలిచిన ప్రతిభ హైస్కూల్ విద్యార్థులు

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** జిన్నారం కేంద్రానికి చెందిన ప్రతిభ విద్యానికేతన హైస్కూల్ విద్యార్థులు కుంగ్ ఫూ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ సాధించారు. ఈ మేరకు హైదరబాద్‌లో ఎల్బీనగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జరిగిన థర్డ్ ఇంటర్నేషనల్ కుంగ్ ఫూ పోటీల్లో ప్రతిభ విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు లోహిత్‌కుమార్, లాస్య, అక్షయ, ప్రశాంత్‌లు వివిధ విభాగాల్లో మార్షల్ ఆర్ట్స్‌కు సంబంధించిన కళా నైపుణ్యాలతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఛాంపియన్ షిప్ సాధించారని ప్రిన్సిపల్ సారా శ్రీనివాస్ తెలిపారు. మాస్టర్ బెస్త నరేష్ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ ఆకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఇంర్నేషనల్ ఛాంపియన్షిప్ పోటిల్లో విజేతలుగా నిలిచి గ్రాండ్ మాస్టర్ డి కంటేశ్వర్, నరేష్ చేతుల మీదుగా విజేతలుగా నిలిచిన ప్రతిభ విద్యానికేతన్ విద్యార్థులు ఛాంపియన్‌షిప్‌ను, మెడల్స్‌ను, సర్టిఫికెట్స్‌ను అందుకున్నారు. ఇంటర్‌నేషనల్ లెవల్‌లో మార్షల్ ఆర్ట్స్ కుంగ్ ఫూ పోటిల్లో విజేతలు గాని ఇచ్చిన లాస్య లోహిత్ అక్షయ ప్రశాంత్‌లను ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపల్ సారా శ్రీనివాస్ అభినందించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడం ఆనందంగా ఉందంటూ అధ్యాపక బృందాన్ని ప్రశంసించారు.

## మెట్రో రైలును సంగారెడ్డి వరకు పొడిగించాలి

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** మెట్రో రైలును సంగారెడ్డి వరకు పొడగించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు సి గోదావరి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో మెట్రో రైలు సంగారెడ్డి వరకు పొడగించాలి అంటూ మహాధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ గతంలో బిజెపి అధ్వర్యంలో మెట్రో రైలును సంగారెడ్డి వరకు పొడగించాలని ధర్నాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంగారెడ్డి వరకు మెట్రో రైలును పొడిగించాలని బిఆర్ఎస్ ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారని, ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున మెట్రో రైలు సంగారెడ్డి వరకు నడిచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు మెదక్ విజయకుమార్, సంగప్ప, పులిమామిడి రాజు, రాజశేఖర్‌రెడ్డి, కుల్‌కర్ణి, మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి

# మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

**జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో గుడుంబా, గంజాయి, డ్రగ్స్ ఇతరత్రా మత్తు పదార్థాలు వాడకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వీటి సరఫరా వినియోగాన్ని పూర్తిగా రూపుమాపాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం సీపీ అనురాధతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ పరివర్తన కార్యక్రమం జిల్లాలో అమలు ప్రక్రియపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపడంతో పాటు నిరోధానికి పకడ్బంధీ చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాల మహమ్మారిపై పోరాటం చేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ళ, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో యాంటీ డ్రగ్స్ కమిటీలుగా ఏర్పడాలని సూచించారు. ఈ కమిటీలు డ్రగ్స్ సరఫరా, నియంత్రణపై దృష్టిసారించడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. ఎవరైనా మత్తు పదార్థాలు సేవించినట్లు, సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే కమిటీలు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ కదలిక కనిపిస్తే సమాచారం అందించడానికి కమిషనరేట్‌లో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సీపీకి సూచించారు.

యాంటి రాగింగ్ ఎలాగైతే అంతం చేశామో యాంటి డ్రగ్స్‌ను కూడా అంతం చేయా లన్నారు. మెడికల్ దుకాణాలలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎలాంటి స్లీపింగ్ టాబ్లెట్స్ అమ్మకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటివి అమ్మడం, సరఫరా చేసే వారిలో భయం కలిగేలా పకడ్బంధీ చర్యలు తీసుకోవాలన్నారు. సీపీ అనురాధ మాట్లాడుతూ జిల్లాలో పాన్‌షాప్, బార్స్ కొన్ని ప్రదేశాలపై ముందస్తు చర్యలు ద్వారా మాదక ద్రవ్యాల సరఫరాపై ప్రత్యేక నిఘా పెంచామన్నారు. మాదక ద్రవ్యాలపై ఎలాంటి సమాచారం వచ్చిన వెంటనే తెలియజేయాలన్నారు. అనంతరం డ్రగ్ ఈజ్ బగ్, సీ గుడ్ బాయ్స్ డ్రగ్స్ గోడ పత్రికలను వారు అవిష్కరించారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్ వినయ్ సుష్మిత, డిఎఫ్ఓ శ్రీనివాస్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, అర్డీఓలు రమేష్‌బాబు, బన్సీలాల్, డిఎంఅండ్‌హెచ్ఓ కాశీనాథ్, డిడబ్ల్యుఓ రామ్‌గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్




అక్కన్నపేటలో సర్వసభ్య సమావేశం దృశ్యం

## సాదాసీదగా సర్వసభ్య సమావేశం

**అక్కన్నపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం రోజున మండల సర్వసభ్య సమావేశానికి ఎంపిపి మాలోతు లక్ష్మిభీలునాయక్ అధ్యక్షత వహించారు. నిర్వహించిన సమావేశంలో మొదట వ్యవసాయశాఖతో ప్రారంభం కాగా మండల వ్యవసాయశాఖ అధికారి నాగరాజును రైతుబంధు డబ్బులు ఇప్పటి వరకు ఎంత మందికి జమచేశారని ప్రశ్నిస్తూ .పెట్టుబడి సహాయంలో జరుగుతున్న నిర్లక్ష్యంపై అక్కన్నపేట ఎంపిటిసి పెసరు సాంబరాజు నిలదీయగా విడతల వారిగా డబ్బులు జమచేస్తున్నట్లు నాగరాజు వివరించారు.మండలంలో పొద్దు తిరుగుడు రైతులు తమ పంటను అమ్ముకునేందుకు కట్కూర్‌లో మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరారు.అంతే కాకుండా మండల వ్యాప్తంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలలో ప్రజా పంపిణీకి ప్రజలు ఎంతో దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని కావున ప్రతీ గ్రామంలో ప్రజా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడివో శంకరయ్య,తహశీల్దార్ సంజీవ్‌కుమార్,ఎంపివో కవికుమార్,ఆయా గ్రామాల ఎంపిటిసిలు,స్పెషల్ అధికారులతో పాటు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి : ఎమ్మెల్యే

**పాపన్నపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్మించుకోవచ్చని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మంగళవారం మండలపరిధిలోని పొడిచన్‌పల్లి తండా, నార్సింగి గ్రామాల్లో మంజూరైన ఉపాధి హామి నిధులతో సిసి రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలానికి 3 కోట్ల రూపాయలు మంజూరయినట్లు, మంజూరైన నిధులతో ప్రతి గ్రామంలో 10 లక్షల చొప్పున అభివృద్ధి చేసుకుందామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను త్వరలనే అమలు చేయనుందన్నారు. పొడచన్‌పల్లి తండా అంగన్‌వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాలలకు పలు వసతులు కల్పించాలని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తేగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ప్రహారిగోడ నిర్మాణానికి 3 లక్షల రూపాయలు, మరుగుదొడ్డి నిర్మాణానికి 2 లక్షల రూపాయలు మంజూరు చేశారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, మడల అధ్యక్షులు గోవింద్‌నాయక్, డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్, మండల నాయకులు శ్రీధర్, సతీషప్ప, సత్యనారాయణ, సంగమేశ్వర్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, సిఆర్ ఏఈ గోపాల్ పాల్గొన్నారు.



ఉపాధి హామి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు




స్వామి వివేకానంద ఐకాన్ జాతీయ అవార్డును అందుకుంటున్న నర్సింహారెడ్డి

## నర్సింహారెడ్డికి స్వామి వివేకానంద ఐకాన్ జాతీయ అవార్డు

**నర్సాపూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** గోల్డెన్ స్టార్ యూత్ కల్చరర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కళావేదిక కళా వెంకటదీక్షితులు హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో నిర్వహించిన స్వామి వివేకానంద ఐకాన్ జాతీయ అవార్డు 2024 పురస్కారాల అందజేత కార్యక్రమంలో నర్సాపూర్ పట్టణానికి చెందిన పిఎన్ రెడ్డి స్కూల్ ప్రిన్సిపాల్ పల్లె నర్సింహారెడ్డికి స్వామి లభించింది. ఈ మేరకు గోల్డెన్‌స్టార్ కల్చరర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు బింగి నరేందర్‌గౌడ్, సెంట్రల్ ఎక్స్‌మినిస్టర్ ఎస్ వేణుగోపాల్‌చారి, హైకోర్టు సీనియర్ మహిళా న్యాయవాది సుభాషిణి, అభినయశ్రీ, నాట్యగురు కె.ఎన్ రాజేశ్వరి శ్రీధర్, డైరక్టర్ శ్రీరాదాకృష్ణ కూచిపూడి నాట్యాలయం కృష్ణప్రియ చేతుల మీదుగా పల్లె నర్సింహారెడ్డిస్వామి వివేకానంద ఐకాన్ జాతీయ అవార్డు ను అందుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద ఐకాన్ జాతీయ అవార్డుగ్రహీత పల్లె నర్సింహారెడ్డి మాట్లాడుతూ విద్యాపరంగా, సామాజిక, సాంస్కృతిక పరంగా గతంలో రోటరీ క్లబ్ ద్వార అందించిన సేవలకు భాగవతా కళాకారుడిగా భారత దేశ సంస్కృతి ధర్మ సామాజిక కార్యకర్తగా పని చేసిన కార్యక్రమాలను గుర్తించి తనకు ఈ అవార్డు కు ఎంపిక చేసిన గోల్డెన్ స్టార్ కల్చరర్ ఆర్గనైజేషన్ అధినేత బింగి నరెందర్, ఇందుకు సహకరించిన ఆందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.



చోరీ జరిగిన ఇండ్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

## గౌరాయిపల్లిలో ఆరు ఇళ్లల్లో చోరీలు

**కొమురవెల్లి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గౌరాయిపల్లిలో అరు ఇండ్లలో ఇండ్ల తాళాలు పగులగొట్టి బంగారు, వెండి అభరణాలు, నగదును దోచుకెళ్లిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నీల కనకయ్య ఇంట్లో 10 తులాల బంగారం, బి. లక్ష్మి ఇంట్లో తులం బంగారం, 6 తులాల వెండి, రూ.21 వేల నగదు, బండి మల్లవ్వ ఇంట్లో 25 తులాల వెండి, తులం బంగారం, రూ.4 వేల నగదు, సన్నపురి రాములవ్వ ఇంట్లో 20 తులాల వెండి పట్టగొలుసులు, రూ.6 వేల నగదను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అలాగే నరెడ్డ మల్లవ్వ ఇంట్లో సుమారు రూ.20 వేల నగదు, దొంతరబాయిన బిక్షపతి ఇంట్లో రూ. 2 లక్షల 80 వేల నగదు చోరీ చేసినట్లు వివరించారు. ఈ విషయం తెలుసుకున్న చేర్యాల సీఐ ఎల్.శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజుతో కలిసి వెంటనే చోరీ జరిగిన ఇండ్లను పరిశీలించారు. క్లూస్ టీం ఏఎస్ఐ క్రాంతి వేలు ముద్రలు సేకరించారు. ఈ మేరకు కొమురవెల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

# డంపింగ్ యార్డు మాకొద్దు

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్ అడవి ప్రాంతంలో డంపింగ్ యార్డు నిర్వహణ కోసం ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయమై పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో కాంగ్రెష్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగ్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను కలిసి ప్రజాభిప్రాయంతో పాటు మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు 13 గ్రామాల ప్రజల అభిప్రాయంతో మాకొద్దు ఈ డంపింగ్ యార్డు తీర్మానం చేసి వినతి పత్రం అందించారు. మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించి తక్షణమే జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పనులను వెంటనే నిలిపి వేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంగ నగరాలలో ఇంటింటికి సేకరించే వ్యర్థాలను గుమ్మడిదల మండలంలోని ప్యార్ నగర్ డింపింగ్ యార్డు ఏర్పాటుచేసి తరలించే కార్యక్రమాన్ని వెంటనే నిలిపి వేయాలని కోరారు. పచ్చని పోలాలు, జీవరాశులకు నిలయమైన పచ్చని అడివిలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే అనేక జీవరాశులకు ప్రమాదం వాటిల్లి పరిసర పచ్చని పల్లెలకు ముప్పు ఏర్పడుతుందన్నారు. తక్షణమే డంపింగ్ యార్డును ఏర్పాటుచేసే విషయాన్ని నిలిపివేయాలని, లేని యెడల రైతులతో కలిసి, స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మద్ది ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బోంతపల్లి ఎంపీటీసీ సురభి నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, కానుకుంట మాజీ సర్పంచి బెకు నిలామ్మ కాంగ్రెస్, యువ నాయకులు ప్రతాప రెడ్డి, పడమటి మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం




మాట్లాడుతున్న మొగిలి సునీతారావు

## ఆరుగ్యారంటీలను ఆమలు చేస్తాం

**మహిళా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 13: ప్రభాతవార్త:**

ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన ఆరుగ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆమలుచేసి తీరుతుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు స్పష్టం చేశారు. మంగళవారం సంగారెడ్డిలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పార్టీ మహిళా విభాగం మండలశాఖ, బ్లాక్, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ సంపదను దోచుకోవడం, దాచుకోవడం మినహ చేసిందేమి లేదని అన్నారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిందని చెప్పారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీ జరుగుతుంటే, కెసిఆర్ ఫామ్‌హౌజ్‌కే పరిమితమయ్యాడని దుయ్యబట్టారు. గ్రూపు పరీక్షల నిర్వహణలో విఫలమైందని అన్నారు. పదవ తరగతి పరీక్ష పేపర్ల లీక్‌లను ఆరికట్టలేకపోయిందని తెలిపారు. ప్రయోజనంలేని ప్రాజెక్టులతో కల్వకుంట కుటుంభం లాభపడిందని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెండు స్థానాలను గెలపించి పార్టీకి బహుమానంగా అందించాలని కోరారు.సమావేశం సందర్భంగా సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లా పరితీరుపై సమీక్ష నిర్వహించారు. రాబోయో పార్టమెంట్ ఎన్నికల కంటే ముందే అన్ని గ్రామాలలో గ్రామకమీటిలు, బూత్‌కమీటిలు ఎంపిక పూర్తి కావాలని అన్నారు. సమావేశంలో సంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు నిర్మాలజగ్గారెడ్డి, ఆయా జిల్లాల పార్టీ మహిళా అధ్యక్షురాళ్ళు పాల్గోన్నారు.

## బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా పెరుమాండ్ల నర్సాగౌడ్

**హుస్నాబాద్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా హుస్నాబాద్‌కు చెందిన పెరుమాండ్ల నర్సాగౌడ్‌ను నియమించారు. ఈ మేరకు జాతీయ ప్రధాన కార్యదర్శి అయిలేష్ యాదవ్ నర్సాగౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భగా నర్సాగౌడ్ మాట్లాడుతూ చట్టసభల్లో వెనుకబడిన వర్గాల గొంతు వినిపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాగౌడ్ తనకు ఈ పదవి వరించేందుకు సహకరించిన ఆర్ క్రిష్ణయ్య, గొర్ల అయిలేష్ యాదవ్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, దరిపెల్లి చంద్రం, అనంతోజు నర్సింహాచారి, నారోజు రత్నయ్యాచారి, పచ్చిమట్ల శ్రీకాంత్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణపై దాడి అమానుషం

**రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు గంప శ్రీనివాస్, అయిత రత్నకర్,**

**సిద్ధిపేట రూరల్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని తెలంగాణ రాష్ట్ర అర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్,కార్యవర్గ సభ్యులు అయిత రత్నకర్, జిల్లా అర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కాసం నవీన్‌కుమార్‌లు తీవ్రంగా ఖండించారు. మంగళవారం సిద్దిపేటలో వారు విలేకరులతో మాట్లాడారు. అర్యవైశ్యులు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉండడం జీర్ణించుకోలేక కొందరు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. సమాజంలో అన్ని కులాలతో పాటు అర్యవైశ్యులకు రాజకీయాల్లో ఉండేందుకు హక్కు ఉందన్నారు. తూకంలో మోసాలు జరిగితే గిట్టుబాటు ధర లభించకపోతే చైర్మన్‌కు, కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని కానీ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. కొంత మంది కావాలని రైతులను రెచ్చగొట్టి అమెను కొట్టుకుంటూ దూషించడం ఏమిటని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా అందోళనలు చేస్తామన్నారు.

## 10 విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

**డిఈఓ రాధాకిషన్**



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డిఈఓ రాధా కిషన్

**పాపన్నపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** రానున్న 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని, అందుకు ప్రణాళిక బద్దంగా విద్యను అందుకోవాలని డిఈఓ రాధా కిషన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలతో పాటు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మండలంలోని చీకోడ్, లింగాయపల్లి పాఠశాలలను ఆకస్మింకగా పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలలో 10లో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందచేశారు. ప్రతి విద్యార్థి 10/10 జిపిఏ సాధించాలని, బాసర త్రిబుల్ ఐటికి ఎంపిక అవుతారని, పలితంగా భవిష్యత్తు బంగారు మయం అవుతుందన్నారు. కార్పోరేట్ కళాశాల యాజమాన్యం తమ దగ్గరకు వచ్చి కళాశాలలో చేరాలని ప్రాదేయపడతారని గుర్తు చేశారు. విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## సిసి రోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షల మంజూరు

**ములుగు, ఫిబ్రవరి 13 (ప్రభాతవార్త):** మండలంలోని పలు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి ఎన్ఆర్ఐజిఎస్ పథకం కింద రూ.30 లక్షలు మంజూరైనట్లు ఎంపిఓ నర్సింలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొక్కొండ గ్రామానికి రూ.5 లక్షలు, కొత్తూరుకు రూ.5 లక్షలు, అన్నసాగర్ గ్రామానికి రూ.5 లక్షలు, నర్సాపూర్‌కు రూ.15 లక్షల నిధులు సిసిరోడ్ల నిర్మాణానికి కేటాయించినట్లు ఆయన తెలిపారు.

## హత్నూర ఎంపిడిఓగా శంకర్

**హత్నూర ఫిబ్రవరి 13: ప్రభాతవార్త:** హత్నూర ఎంపిడిఓగా బి.శంకర్ నియమితులయ్యారు. ఇక్కడ ఇప్పటి వరకు ఎంపిడిఓగా పనిచేసిన శారదాదేవి నల్గొండగకు బదిలి అయిన విషయం తెలిసిందే. హత్నూర ఎంపిడిఓగా శంకర్‌ను నియమిస్తూ మంగళవారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు వెలువరించారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

## మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

**చేర్యాల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో చేర్యాల మున్సిపల్ కమిషనర్‌కు సమ్మెకు సంబంధించిన నోటీసును మంగళవారం అందించారు. ఈ సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం అంగడిబజార్‌లో కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొంగరి వెంకటమావో, ఇప్పకాయల శోభ, రాళ్లబండి నాగరాజు, బండకింది అరుణ్‌కుమార్, రాళ్లబండి భాస్కర్, ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### తాజా మాజీ సర్పంచ్ చొరవతో రోడ్డుకు మరమ్మతు


రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

**చేర్యాల (మద్దూరు), ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామం నుండి కూటిగల్ వెళ్లే ప్రధాన రహదారి ఏడాది క్రితం వర్షాలకు తెగి కొట్టుకుపోవడంతో గత నెలలో మద్దూరు మండలం సిపిఎం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలపగా వల్లంపట్ల తాజ మాజీ సర్పంచ్ ఆలేటి రజితయాదగిరి చొరవతో సంబంధిత అధికారులు స్పందించి తెగిపోయిన రోడ్డు, కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టినందుకు మద్దూరు సిపిఎం పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తూ, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

### మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రవికుమార్


మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అంతిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త :** ఈనెల16వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న కార్మిక సమ్మె గ్రామీణ బంద్ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ,కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు.మంగళవారం రోజున కేంద్రంలో ప్రజా కార్మిక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న సమ్మెలో పాల్గొని విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్నలకు సమ్మె నోటీసులు అందజేసి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి కార్మిక చట్టాలను తిరగరాస్తున్నాయని ప్రజా కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేఖ విధానాలకు నిసరసనగా జాయింట్ కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు,అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్‌మోర్చ కార్మికులు సమ్మెతో పాటు భారత్‌బంద్‌కు పిలుపు నిచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కార్మికుల హక్కులు ప్రభుత్వాలు విస్మరించవద్దన్నారు.వారి డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సారయ్య,నాయకులు ప్రభాకర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రిమ్మనగూడలో సిసి కెమెరాలను ప్రారంభించిన సిఐ

**గజ్వేల్, ఫిబ్రవరి 13 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామపంచాయతీ సమీపంలోని వీధిలో కొన్ని రోజుల క్రితం దొంగతనం జరిగింది. మంగళవారం అట్టి విషయంలో గజ్వేల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదా గ్రామాన్ని సందర్శించి వీధిలో రక్షణ గురించి నేను సైతం కార్యక్రమంలో భాగంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలుపగా ఆ వీధిలోని పెద్దలు అందరూ కలిసి నాలుగు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోగా వాటిని సిఐ సైదా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరించిన పెద్దలను అభినందించారు. సిసి కెమెరాలవల్ల గ్రామాల్లో ఎలాంటి కేసులు నమోదు కావని, ఏ చిన్న సంఘటన జరిగినా సిసి కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామంలో రాత్రింబవళ్లు 24 గంటలు ప్రజలకు రక్షణగా నిలుస్తాయన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో సిసి కెమెరాలు లేని గ్రామాలు సిసి కెమెరాల ఏర్పాటు గురించి ముందుకు వచ్చి పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. గ్రామంలో పోలీస్ శాఖ తరపున ఏమైనా రక్షణ అవసరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు, బెల్ట్ షాపులు, గుట్కాలు ఎవరైనా అమ్మితే, గ్రామంలో పేకాట ఆడితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సిఐ సైదా తెలిపారు.

## ఆయుర్వేదంతో ఆరోగ్యమయమైన జీవనం

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తారా కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఇమ్యూనిటీ బూస్టర్ పై హెల్త్ క్యాంప్‌ను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎస్ఎస్ రత్న ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పూర్వ కాలం నుంచి ప్రపంచానికి ఆయుర్వేదం, యునాని, సిద్ధ, యోగ లాంటి వాటిని పరిచయం చేసిందన్నారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా డాక్టర్ నర్మదాషిండే, హోమియో డాక్టర్ శ్యాం సుందర్, ఆయుర్వేద డాక్టర్ సమీరా, యునాని మెడిసిన్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆయుర్వేదానికి సంబంధించిన పరిజ్ఞానం పొంది ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతిలో లభించే అనేక వనమూలికలు మనకు ఎలాంటి వ్యాధిని అయినా నయం చేసుకునే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ యం ప్రవీణ, అధ్యాపకులు డాక్టర్ వెంకటేశం, వృక్షశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ విజయ్, అధ్యాపకులు డాక్టర్ ఎన్ సిద్దులు, డాక్టర్ పద్మజ, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇమ్యూనిటీ బూస్టర్‌పై క్యాంప్ నిర్వహిస్తున్న దృశ్యం

# 15న కొమురవెల్లి మల్లన్న రైల్వే స్టేషన్‌కు భూమి పూజ

## హాజరు కానున్న మధ్యప్రదేశ్ సీఎం, కేంద్ర మంత్రి

**కొమురవెల్లి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి స్వాగత తోరణం వద్ద ఈనెల 15న మధ్య ప్రదేశ్ సిఎం మోహన్‌యాదవ్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి చేతుల మీదుగా రైల్వే స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్నట్లు బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి తెలిపారు. కొమురవెల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయానికి రోజు 25 వేల మంది భక్తులు వస్తుంటారని వారి దశాబ్దాల కల నెరవేరిందన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ విజ్ఞప్తి మేరకు ప్రధాని మోడీ కేంద్ర రైల్వేవాఖ మంత్రి అదేశాలతో కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈనెల 15న నిర్వహించే కార్యక్రమానికి బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలన్నారు.

**భూమిపూజ స్థలాన్ని పరిశీలించిన పోలీసు అధికారులు**

ఈనెల 15న శ్రీకొమురవెల్లి మల్లన్న దేవాలయం సమీపంలో రైల్వే స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేయడానికి మధ్యప్రదేశ్ సిఎం, కేంద్ర మంత్రి వస్తుండడంతో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, చేర్యాల సీఐ శ్రీనివాస్, ఎస్ఐ నాగరాజులు, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, రెవెన్యూ సిబ్బంది స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో దండ్యాల లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**బిఆర్ఎస్ నుంచి బిజెపిలో చేరిక...**

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై ఐనాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు శరత్, కిరణ్, శివకృష్ణ, మెరుగు శ్రవణ్ సిద్దిపేట జిల్లా బిజెపి అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, జనగామ అసెంబ్లీ కో కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి అధ్వర్యంలో అ పార్టీకి రాజీనామా చేసి బిజెపి తీర్థంపుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి కాషాయపు కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దండ్యాల వెంకటరెడ్డి, దండ్యాల లక్ష్మారెడ్డి, కాశెట్టి పాండు, సానాది కర్ణాకర్, పోతుగంటి అంబదాస్, బూరుగు సురేష్‌గౌడ్, విభీషన్‌రెడ్డి, సురేష్‌గౌడ్, విజయ లక్ష్మీ, తోకల ఉమారాణి, పాండు, భాస్కర్‌రెడ్డి, లక్ష్మణ్ నాయక్, భిక్షపతి, నాయక్, సిద్దారెడ్డి, భిక్షపతిరెడ్డి రాందాసు, నర్ర మహేందర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పోతం శెట్టిపల్లి గ్రామంలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతున్న పారిశుధ్య కార్మికులు

## ముమ్మరంగా పారిశుధ్య పనులు

**కొల్చారం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, పోతం శెట్టిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుంధతి అన్నారు. పోతంశెట్టిపల్లి గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. మురికి కాలువలు శుభ్రం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం తదితర పనులను చేశారు. ఈ సందర్భంగా అరుంధతి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలను గ్రామంలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**కొడంగల్,ఫిబ్రవరి 13ప్రభాతవార్త**

కొడంగల్ పట్టణంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో మంగళ వారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కటి బోధనతో అలరించారు.స్వయం పరిపాలన దినోత్సవంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా రాంచరణ్,డీఈఓగా శివశంకర్,ఎంఈఓగా ఉజైఫాన్‌లతో పాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తు తోటి విద్యార్థులకు చక్కటి బోధనతో అలరించారు.స్వయం పరిపాల నలో చక్కని ప్రతిభ కనబర్చిన ప్రధానోపాధ్యాయులు రాంచ చరణ్,డీఈఓ శివశంకర్,ఎంఈఓ ఉజైఫాన్‌లకు పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు అబ్దుల్ హక్,వెంకటేశం, సాలిభాయి, సబీహబేగం,నసీంబాను తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## 16న జరిగే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి

**యాచారం ఫిబ్రవరి13,ప్రభాతవార్త :**

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలకు నిరసనగా ఈనెల 16న చేపడుతున్న గ్రామీణ బందు విజయ వంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం యాచారం మండలంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అతిథిగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ హాజ రై ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని రైతుల నడ్డి విడిచే నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని పెరిగిన పెట్రోల్ ,డిజి ల్ ధరలను తగ్గించాలని రైతులు సబ్సిడి రుణాలు అందించాలని డిమాండ్ చేశారు.16న ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలంపల్లి జంగయ్య, ముచ్చర్ల లాజర్ ఆలంపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి విష్ణువర్ధన్‌రెడ్డి ఆర్థిక సహాయం

**పెద్దేముల్, పిబ్రవరి 13, ప్రభాతవార్త:**

బాధిత కుటుంబానికి ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి ఆర్థిక సహాయం చేసి తన ఉదారతను చాటుకున్నారు. పెద్దేముల్ మండల కేం ద్రానికి చెందిన దరిమిది రవి ఆనారోగ్యంతో మృతి చెందిన విష యాన్ని తెలుసుకున్న ఎప్ఎస్‌సిఎస్ చైర్మెన్ ద్యావరి విష్ణు వర్ధన్‌రెడ్డి, విష్ణు అన్న యువసేన సభ్యుల ద్వారా భాధిత కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా విష్ణు అన్న యువసేన సభ్యులు పర్యాద రవి, కిరన్, మెకల రాములు, పిల్లి మల్లేష్, బాల్‌రాజ్, పడగల రవి, వెంకటయ్య తదితరులు మాట్లాడుతూ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి భాధిత కుటుంబాలకు అండగా నిలబడి వారికి ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని అన్నారు. ద్యావరి విష్ణు అన్నను ఆదర్శంగా తీసుకొని మరికొందరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.


కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న యాదగిరి

## విలేకరిని కొట్టి చంపుతానని బెదిరించినవారిపై ఫిర్యాదు

**కొండపాక, ఫ్రిబవరి 13, ప్రభాతవార్త :** అక్రమంగా మట్టి తరలిస్తున్నరని వార్త ప్రచురించినందుకు కక్ష గట్టిన అక్రమ మట్టి దందా మాఫియా ఒ విలేకరి పై అకారణంగా దాడి చేసి తీవ్రంగా కొట్టి, చంపుతామంటు బెదించిన వ్యక్తులపై కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు బాధిత విలేకరి తెలిపారు. బాధిత విలేకరి ముస్త్యాల యాదగిరి కలం నిఘా దిన పత్రికలో ఈ నెల 4న నోట్ల కట్టలవుతున్న మట్టి కుప్పలు అనే శీర్షికతో అక్రమ మట్టి దందా పై వార్తను ప్రచురించాడు. ఈ విషయాన్ని మనుసులో పెట్టుకున్న మట్టి మాఫియా మంగళవారం కొండపాక మండలం తిమ్మారెడ్డ పల్లి శివారులో అక్రమమట్టి తరలింపునకు పాల్పడుతున్న మాఫియా వార్తను ప్రచురించిన వార్తకు రెచ్చిపోయిన వారు కొమురవెళ్లి రైల్వే నిర్మాణ పనుల్లో భాగంగా తీసున్న మట్టిని ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టిని కొంత మంది వెంచర్లకు తరలిస్తున్నరని వార్తను ప్రచురించాడు. ఈ రోజు మధ్యాహ్నం విలేకరి యాదగిరి తన స్నేహితుడితో కలసి ద్విచక్ర వాహనం పై మధ్యాహ్నం తిమ్మారెడ్డిపల్లి వెళ్తున్న క్రమంలో మట్టి మాఫియా అడ్డుకొని కర్రలతో, రాళ్లతో విచక్షణ రహితంగాదాడి చేయడంతో నడవలేని స్థితికి చేరుకున్నట్లు తెలిపారు. దాడి చేసి కొట్టిన తర్వాత తాగడానికి మంచి నీరు ఇవ్వమన్న ఇవ్వకుండా బూతు మాటలు తిట్టారని వివరించారు. అంతే కాకుండా మా దందాకు అడ్డువచ్చిన విలేకరు లను ఎవరిని వదిలిపెట్టమని హెచ్చరించారని తెలిపారు. విషయం తెలుసు కున్న సహచర జర్నలిస్టులు అతని వద్దకు వెళ్లగా వారితో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### యాచారం ఎంపిడివోగా నరేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

**యాచారం ఫిబ్రవరి13,ప్రభాతవార్త :**

యాచారం మండలం నూతనంగా అభివృద్ధి అధికారిగా నరేంద ర్ రెడ్డి మంగళవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించా రు.ఎంపిపి కొప్పు సుకన్య భాష వారిని ఘనంగా స్వాగతిస్తూ సన్మానించారు.గతంలో యాదాద్రి భువనగిరి నుండి ఇక్కడికి బదిలిపై వచ్చినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపివో ఉమారాణి,పంచాయతీ ఉస్మాన్,సూపరిండెంట్ శైలజ,వివిధ గ్రామాల గ్రామపంచాయతీ సెక్రటరీ మండల కార్యదర్శి,పంచాయతీ ఏఈ ఉస్మాన్, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## పడకేసిన నిఘా నేత్రం....

**కొత్తూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :**

పడకేసిన నిఘానేత్రం విచ్చలవిడిగా దొంగతనాలు చేసుకునేందు కు సువర్ణ అవకాశంలా మారిపోయింది. నెలరోజుల వ్యవధిలోనే మండలంలోని రెండు దేవాలయాల్లో దొంగతనాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. కొత్తూర్ పురపాలికలోని 6వ వార్డు భవానినగర్ కాలనీలో మందోని బాయ్ మైసమ్మ దేవాలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అమ్మ వారికి సబంధించిన హుండీతోపాటు విలువైన వస్తువులు సుమారు రెం డు తులాల బంగారం, 30 నుండి 40తులాల వెండి దీంతో పాటు ఇత్తడి వస్తువులు, పూజా సామాగ్రి దొంగిలించినట్లు ఆలయ ధర్మకర్త మలిపెద్ది విశ్వం గుప్తా తెలిపారు. సమాచారం అందుకున్న స్థానిక కౌన్సిలర్ వీరమోని హేమదేవేందర్‌ముది రాజ్‌తోపాటు ఇన్స్పెక్టర్ నరసింహరావు ఆలయ పరిసరాలను పరిశీలించారు. దీంతో చుట్టుపక్కల పోలీసువారు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగా పనిచేయకపోవడంతో దొంగలను గుర్తించడం అతి కష్టంగా మారింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పనిచేయని కెమెరాలను సరిచేయాలని కోరుతున్నారు.

### తిరుపతిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**పెద్దేముల్, పిబ్రవరి 13, ప్రభాతవార్త:**

సిఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, కోడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డిని పెద్దేముల్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్.నారాయన్‌రెడ్డి, నాయకులు ఎస్,శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. మంగళ వారం హైద్రాబాద్‌లోని తిరుపతిరెడ్డి నివాసంలో ఆయనను కలిసి పార్టీ అధికారం లోకి రావడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.

# కాళేశ్వరం తెలంగాణకు జీవనాధారం

## ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, ఫిబ్రవరి 13 (ప్రభాతవార్త):**

కృష్ణానది జలాలలో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు తలపెట్టిన ఛలో నల్లగొండ బహిరంగ సభకు మంగళవారం మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానది జలాలను కేంద్ర ప్రభుత్వానికి అప్పజెప్పాలని చూస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కృష్ణా జలాలు అప్పగిస్తే తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి ఐదు జిల్లాలు ఎడారిగా మారుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు కరువు కాటకాలు తెచ్చే అవకాశం ఉందని, మాజీ సిఎం కెసిఆర్ ఎడారిగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని పచ్చని పంటపొలాలుగా మార్చారని అన్నారు. మండుటెండల్లో సైతం సాగునీరు అందించారని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు కాళేశ్వరం యాత్రకు బయల్దేరారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించే టప్పుడు కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్‌లలో ఉన్న నీటిని చూడాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్ చేసే వ్యవస్థ అని, కాళేశ్వరం అంటే 240 టిఎంసిల నీటి వినియోగం అన్నారు. ప్రస్తుతం 147 టిఎంసిల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లు ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగినట్లు బూతద్దంలో చూపుతున్నారని అన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధి లేకుండా రైతులను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్వహించిన బహిరంగసభకు పెద్దఎత్తున తరలివెళ్ళడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పంగ మల్లేశం, రామచంద్రం, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, బయ్యారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, హైదర్ పటేల్, ఉమ్మర్, అహ్మద్, అబ్దుల్, ఎల్లేశ్, కుర్రె మహేందర్‌రెడ్డి, ఎల్ల వెంకటేష్, చిన్నమల్లయ్య, ఎంపిటిసి జ్యోతి స్వామి, దయాకర్‌రెడ్డి తదితరులు తరలివెళ్ళారు.


నల్లగొండకు తరలివెళ్తున్న మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు


బహిరంగ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

## బహిరంగ సభకు తరలివెళ్లిన బిఆర్ఎస్ నాయకులు

**చేర్యాల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు చేర్యాల మండల బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాల నిర్వహణ బాధ్యత కృష్ణ రివర్ మేనేజ్మెంట్ బోర్డుకు అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. సభకు తరలివెళ్ళిన వారిలో మాజీ ఎంపిపి మేడిశెట్టి శ్రీధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మరాజీవ్‌రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ పూర్మ వెంకట రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు చంటి, సతీష్, నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, నాగేశ్వర్‌రావు, శివగారి అంజయ్య, పచ్చిమడ్ల సిద్ధిరాములు, బూరగోని తిరుపతిగౌడ్, ఆవుశర్ల కిషోర్ ఉన్నారు.

**ములుగు నుంచి...**


ములుగు నుండి తరలివెళ్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

**ములుగు, ఫిబ్రవరి 13 (ప్రభాతవార్త):** బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ములుగు మండల బిఆర్ఎస్ శ్రేణులు మండల పార్టీ అధ్యక్షుడు జహంగీర్, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డిల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో తరలివెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానది జలాలను కేంద్ర ప్రభుత్వానికి అప్పజెప్పాలని చూస్తుందని, దీని వల్ల తెలంగాణ రాష్ట్రంలో ఐదు జిల్లాలు ఎడారులుగా మారుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కాళేశ్వరంతో పాటు మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ లాంటి ప్రాజెక్టులను నిర్మించి బీడుభూములను పచ్చని పంట పొలాలుగా మార్చారని అన్నారు. తరలివెళ్ళిన వారిలో జెడ్‌పి కో-ఆప్షన్ సభ్యుడు సలీం, ఎంపిపి ఉపాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేష్‌గౌడ్, రాష్ట్ర బిఆర్ఎస్ మైనార్టీ నాయకుడు జుబేర్‌పాషా, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు లింగారెడ్డితో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు ఉన్నారు.

**కొల్చారం నుంచి...**


నల్గొండ సభకు తరలివెళ్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

**కొల్చారం, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త:** తెలంగాణ నది జలాల పైన కేంద్రం పెత్తనానికి దాసోహమన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఛలో నల్గొండకు తరలివెళ్తున్నామని బీఆర్ఎస్ పార్టీ కొల్చారం మండల అధ్యక్షుడు రాంపల్లి గౌరి శంకర్‌గుప్త, పారీ నేతలు ముత్యంగారి సంతోష్, కరెంట్ రాజా గౌడ్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని బస్టాండ్ నుండి బస్సులో బిఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు రాంపల్లి గౌరి శంకర్ ఆధ్వర్యంలో భారీగా బిఆర్ఎస్ నేతలు నల్గొండలో నిర్వహించే భారీ బహిరంగ సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నేతలు గౌరి శంకర్, సంతోష్, రాజాగౌడ్‌లు మాట్లాడుతూ కృష్ణ బేసిన్ ప్రాజెక్టులను కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అప్పగిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న తెలంగాణ వ్యతిరేక వైఖరిని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రవితేజ రెడ్డి, నర్సింలు, సందీప్, రాయన్న, సాయిబాబ గౌడ్, శ్రీనివాస్, గోపి, కాశి, రవీందర్‌రాజు, శ్రీధర్, అనిల్, సిద్దిరాంరెడ్డి, ఆంజనేయులు, రాజా గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## క్రీడాకారునికి ఆర్థిక సహాయం అందజేత


క్రీడాకారునికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఈనెల 16 నుంచి 19 వరకు జరిగే 19వ జూనియర్స్ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ షాట్ పుట్ అండర్-16 విభాగంలో భూంపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బొమ్మనమైన రమేష్ ఎంపికయ్యారు. దీంతో క్రీడాకారునికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రూ.5 వేల ఆర్థిక సహాయం అందించి మాట్లాడారు. గుజరాత్‌లో జరిగే అథ్లెటిక్స్ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, సిద్దిపేట జిల్లాకు, భూంపల్లికి మంచిపేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా పిఈటి వెంకటరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నరేష్ పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ పరికరాల పునర్వినియోగంపై అవగాహన

**గజ్వేల్, ఫిబ్రవరి 13 (ప్రభాతవార్త):**

గజ్వేల్ పట్టణంలోని బాలుర విద్యా సౌదంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం టిఎస్‌కెసి ఆధ్వర్యంలో నిరుపయోగ ఎలక్ట్రానిక్ పరికరాలను పునర్వినియోగం మరియు నిర్వహణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా టాస్క్ మేనేజ్మెంట్ ట్రైనీ బి.స్వప్న ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో నిరుపయోగ ఎలక్ట్రానిక్ వస్తువుల సంఖ్య 16 నుండి 106కు పెరిగిందని, వీటి సమర్థవంతమైన నిర్వహణ కోసం ప్రజలకు నైపుణ్యాలను పెంపొందించడం కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో కొంత మొత్తాన్ని కూడా కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌కెసి కో-ఆర్డినేటర్ డాక్టర్ కవిత, టిఎస్‌కెసి మెంబర్ ఎండి.జబ్బర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.గణపతి, సీనియర్ అధ్యాపకులు ఎస్.రమేష్‌బాబు, లక్ష్మీనర్సయ్య, మార్కండేయ, కైలాష్, పద్మ, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టాస్క్ మేనేజ్మెంట్ ట్రైనీ స్వప్న

## బిజెపి మండల అధ్యక్షుడిగా ఓంకార్‌యాదవ్

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా వడ్డి గ్రామానికి చెందిన ఓంకార్‌యాదవ్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఉత్తర్వులు అందచేశారు. ఇంత వరకు మండల అధ్యక్ష బాధ్యతలు నిర్వహించిన అత్నూర్ గ్రామానికి చెందిన ఏక్‌నాథ్‌పాటిల్‌ను తప్పించి ఓంకార్‌యాదవ్‌కు పార్టీ అధిష్టానం అవకాశం కల్పించింది.కాగా ఓంకార్‌యాదవ్ విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఏకల్ విద్యాలయ జిల్లా స్థాయి బాధ్యతలు నిర్వహించారు. మండల బాధ్యతలు అప్పగించిన పార్టీ జిల్లాఅధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ఉపాధ్యక్షులు మల్లికార్జున్‌పాటిల్‌కు, సహకరించిన నియోజకవర్గ, మండల బాధ్యులకు ఓంకార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

**ఝరాసంగం మండల అధ్యక్షుడిగా బంటు విశ్వనాథ్...**

**ఝరాసంగం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** భారతీయ జనతాపార్టీ ఝరాసంగం మండల అధ్యక్షుడిగా బంటు విశ్వనాథ్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సి.గోదావరి అంజిరెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులకు, అందుకు సహకరించిన జిల్లా, అసెంబ్లీ, మండల, బూత్ నాయకులకు, కార్యకర్తలకు బంటు విశ్వనాథ్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ పటిష్టతకు తన వంతు సహకారం అందిస్తానని బంటు విశ్వనాథ్ పేర్కొన్నారు.

## సాయినగర్ కాలనీలో సిసి రోడ్డు పనులకు శ్రీకారం



సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేసి ప్రారంభిస్తున్న పుష్పనగేష్

**సంగారెడ్డి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయినగర్‌కాలనీ రోడ్డునంబర్ 5 హైటెన్షన్ రోడ్డులో 45 రూ.లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ భూమి పూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పుష్పనగేష్ మాట్లాడుతూ రోడ్డు పనులు పూర్తయితే అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వారికి ప్రయోజనం కలుగుతుందన్నారు. మూడు సంవత్సరాలు విజయవంతంగా బాధ్యతలు పూర్తిచేసుకున్న కార్పొరేటర్‌కు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, వెంకటేశ్వర్లు, యదిరెడ్డి, వీరాంజనేయులు, నాగిరెడ్డి, మాణయ్య, రాజు, పూజిత, లక్ష్మమ్మ, మల్లేష్, చాకలి నర్సింహా పాల్గొన్నారు.

## చిన్నారులకు 'ఎ'విటమిన్ సిరప్



చిన్నారులకు ఎ విటమిన్ సిరఫ్ తాగిస్తున్న వైద్య సిబ్బంది

**ఝరాసంగం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పిహెచ్‌సి వైద్యురాలు రమ్య ఆదేశాల మేరకు ఎ విటమిన్ సిరఫ్‌ను వైద్య సిబ్బంది తాగించారు. ఎ విటమిన్ సిరఫ్ వినియోగంతో చిన్నారుల ఆరోగ్యం నిలకడగా ఉంటుందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సు శశికళ, ఆశ వర్కర్ చంద్రకళ, రేణుక, యందు బాయ్ తదితరులు ఉన్నారు.

## దామోదర్ గెలుపుతో మొక్కు తీర్చుకున్న కౌన్సిలర్



అనుచరులతో కాలినడకన ఏడుపాయలకు చేరుకున్న కౌన్సిలర్ హరిక్రిష్ణగౌడ్

**జోగిపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** అందోలు నియోజకవర్గం నుంచి దామోదర్ రాజనర్సింహ గెలిస్తే కాలినడకన ఏడుపాయలకు వస్తానని మొక్కుకున్న అందోలు మున్సిపల్ కౌన్సిలర్ హరిక్రిష్ణగౌడ్ మంగళవారం మొక్కును చెల్లించుకున్నారు. ఆయన తన అనుచరులతో మంగళవారం ఉదయం అందోలు నుంచి కాలినడకన బయలుదేరి ఏడుపాయలకు చేరుకొని, అక్కడ అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. దామోదర్ రాజనర్సింహ గెలపొందటంతోపాటుగా కేబినేట్‌లో ముఖ్యమైన మంత్రి పదవి దక్కటం చాలాసంతోషకరమని వారు ఆనందం వ్యక్తం చేశారు. కాగా కాలినడకన ఏడుపాయలకు వెళ్లినవారిలో రొయ్యల శ్రీను, పుర్ర శ్రీను, నాదులాపూర రమేష్, మ్యాతరి శ్రీను, జెల్ల భాగయ్య పాల్గొన్నారు.

## వైభవోపేతంగా మార్కండేయ ఉత్సవాలు



మార్కండేయ దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**రామాయంపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** మార్కండేయ జయంతి ఉత్సవాలు అట్టహాసంగా సాగాయి. ఈ సందర్భంగా పద్మశాలీ మహిళలు, సంఘ సభ్యులు మార్కండేయ విగ్రహంతో శోభాయాత్ర చేపట్టారు. అలాగే మహిళలు కలశయాత్ర ఇక్కడి మహంకాళి ఆలయం నుండి కదిలింది. కార్యక్రమంలో పద్మశాలిఅధ్యక్షుడు మద్దెల రమేష్, పాగాల బాల్‌నర్సయ్య, దేవాలయం చైర్మెన్ మద్దెల సత్యం, మహిళ చైర్మెన్ బల్ల కవిత, మద్దెల వాణి, యువజన విభాగం అధ్యక్షుడు మద్దెల సాగర్‌లు ఉన్నారు.

## సిడిపివో ఉద్యోగానికి ఎంపికైన అలైక్య...

**రామాయంపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** ఇరవై నాలుగేళ్ల వయస్సులోనే ఉన్నత అధికారిని (సీడీపిఓ) ఉద్యోగం సాధించిన అలైక్యకు ఘన సన్మానం జరిగింది. రామాయంపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన మల్లేశం-మన్నెమ్మ కూతురు అలైక్యా పిజి పూర్తి చేసిన పిదప ఈ ఉద్యోగాన్ని సంపాదించింది. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆమె పేదరికంలో మగ్గుతూ ప్రభుత్వ విద్యను అభ్యసించి ఇంతటి ఉన్న తాధికారిగా ఎదిగింది. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో సీడీపీఓ అలైక్యా మాట్లాడుతూ తాను ఎన్నో ఒడిదొడుకులు తట్టుకుని ఇంతటి స్థాయికి వచ్చానని చెప్పారు. కటుంబ ప్రోత్సాహమే నన్ను ఎదిగేలా చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, మాజీ ఎంపిటీసీ సిద్దిరాంరెడ్డి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం, భీమసేన, చేదల్ భాస్కర్‌లు పాల్గొన్నారు.



అలైక్యను సన్మానిస్తున్న దృశ్యం



మనూర్ నుంచి నల్గొండ సభకు తరలుతున్న బిఆర్ఎస్ నేతలు



ఝరాసంగం నుంచి నల్గొండ సభకు తరలుతున్న బిఆర్ఎస్ నేతలు



నాగల్‌గిద్ద నుంచి నల్గొండ సభకు తరలుతున్న బిఆర్ఎస్ నేతలు

# నల్గొండ సభకు తరలిన బిఆర్ఎస్ నాయకులు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

నల్గొండలో బిఆర్ఎస్ నిర్వహిస్తున్న భారీ బహి రంగ సభకు జహీరాబాద్ మండలం నుంచి నాయ కులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మాజీ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో కృష్ణానది జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణకు చలో నల్గొండ నిర్వహిస్తున్న కార్యక్రమానికి బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కేసిఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎంపి టిసి సభ్యులు శంకర్, బస్వరాజ్, తాజా మాజీ సర్పంచ్‌లు చిన్న పటేల్, విజయ్, మండల బిసి సెల్ అధ్యక్షులు అమిత్‌కుమార్, నాయకులు జగదీష్, కిష్టయ్య, పెంటారెడ్డి, సతీష్, శ్రీకాంత్‌రెడ్డి, అభిషేక్ రెడ్డి, తాహెర్, వెంకట్‌రెడ్డి, పర్వేజ్ పాల్గొన్నారు.

**మనూర్ నుంచి...**

**మనూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డ్(కెఆర్ఎంబి) కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తెలంగాణ వ్యతిరేక విధానాలను ఖండిస్తూ నల్గొండలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పార్టీ మండల అధ్యక్షులు విఠల్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో ఆయాగ్రామాల పార్టీశ్రేణులు మంగళవారం తరలి వెళ్లారు. నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి సూచనల మేరకు పార్టీ శ్రేణులు ప్రత్యే కంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో పార్టీకి, కేసిఆర్‌కు, మహారెడ్డి భూపాల్‌రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేస్తూ తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు, మాజీ సర్పంచ్‌లు పండరి, జనార్దన్ రెడ్డి, నర్సింలు, సంజీవులు తదితరులు ఉన్నారు.

**ఝరాసంగం నుంచి...**

**ఝరాసంగం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

నల్గొండలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళ వారం నిర్వహించిన సభకు మండలంలోని ఆయా గ్రామాల బిఆర్ఎస్ నేతలు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనం లో పార్టీ నాయకులు బిఆర్ఎస్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ సభకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాచ్నూర్ వెంక టేశం, సంతోష్‌పాటిల్, మాణిక్ ప్రభు పాటిల్, ఎజాజ్ బాబ, మల్లికార్జున్ పాటిల్, సోయల్ రాజు ఉన్నారు.

**నాగల్‌గిద్ద నుంచి...**



జహీరాబాద్ నుంచి నల్గొండ సభకు తరలుతున్న బిఆర్ఎస్ నేతలు

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ నేతలు మంగళవారం నాగల్‌గిద్ద నుంచి నల్గొండలో నిర్వహించే బిఆర్ఎస్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కృష్ణ జలాల హక్కుల పరిరక్షణ పేరిట నల్గొండలో బిఆర్ఎష్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నేతృత్వంతో జరిగే సభకు పార్టీ నాయకులు బిఆర్ఎస్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ సభకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనంలో తరలివెళ్లారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు రాజ్ రాథోడ్, ఎంపిపి ఉపాధ్యక్షులు పండరి యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు మైత్రి పండరి, నాయకులు నందు పాటిల్, అంజిరెడ్డి, శివరాజ్, విఠల్‌రావు పాటిల్, లక్ష్మణ్, జాదవ్ తదితరులు ఉన్నారు.



మాజీ ఎమ్మెల్యే మైనంపల్లిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

## పార్టీకి కార్యకర్తలే వెన్నుముక

### మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

**రామాయంపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఐకమత్యంలో మెలగాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు సూచించారు. మంగళవారం స్థానిక రేణుకా ఎల్లమ్మదేవిఆ ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలతో మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్నారని, ఇది మంచి పద్దతి కాదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని గ్రామాలకు చెందిన ఇరువర్గాల వారితో మాట్లాడి వారిని సముదాయించారు. అంతకు మందు ఆలయ నిర్వాహకులు పల్లె శ్రీనివాస్‌గౌడ్ హన్మంతరావును సన్మానించారు. ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులుపాల్గొని అమ్మవారికి ఓడిబియ్యం పోశారు. పీసీసీ కార్యదర్శి సుప్రభాత్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు గంగా నరేందర్, పార్టీ పట్టణ శాఖ కార్యదర్శి అల్లాడి వెంకటేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో కొనసాగుతున్న పనులను వెంటనే పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

**నర్సాపూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** పట్టణంలో కొనసాగుతున్న పనులను వెంటనే పూర్తి చేయాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం 6, 7వ వార్డుల్లో నడుస్తున్న మురికి కాలువలు, డ్రైనేజీ తదితర పనులను ఆయన మున్సిఫల్ వైస్ చైర్మన్ ఎండి నహిమొద్దీన్ తో కలిసి ఈ వార్డుల్లో పర్యటించి నడుస్తున్న పనులను పరిశీలించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్డుల్లో కొనసాగుతున్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. అంతేగాక పనులను నాణ్యతగా ఉండెవిదంగా చూడాలని వారికి తెలియజేయడం జరిగింది. ఈసమయంలో మున్సిపల్ చైర్మన్, అశోక్‌గౌడ్, మున్సిఫల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్ లతో పాటు కౌన్సిలర్ గొల్ల రుక్కమ్మ, ఫైసల్‌బాయి, సరోష్,నాగభూషణం, ఫేజాన్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ బహిరంగ సభకు తరలిన నాయకులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 13.ప్రభాతవార్త:** నల్గొండ జిల్లాలో జరిగె బిఆర్ఎస్ పార్టీ భహిరంగ సభకు నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అద్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు బారీ సంఖ్యలో తరిలి వెళ్ళడం జరిగింది. ఈ సందర్బంగా బిఆర్ఎస్ నాయకులకు కార్యకర్తలకు వారి వారికి కేటాయించిన వాహానాల్లో బయిలుదేరి వెళ్ళారు ఈ సందర్బంగా మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ అబివృద్ది కోసం ఎన్నో అభివృద్ధికార్యక్రమాలు, మరెన్నో ప్రజా సంక్షేమ పథకాలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జలసాధనలో బాగంగా నల్గొండ జిల్లా లో భారీ భహిరంగ సభకు ఆయన రానున్నట్లు తెలిపారు. ఈ జలసాధన ఉధ్యమం ఈరోజు నుండి ప్రారంభమవుతుందని జలసాధన సాధించే వరకు బిఆర్ఎస్ అధినేత మాజీ సిఎం కెసిఆర్ వెంట ఉండి పోరాడుతామని ఆయన తెలిపారు. ఈ మేరకు నల్గొండ భహిరంగ సభకు నర్సాపూర్ నుండి బారీగా బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తరలివెళుతున్నందులకు ఈ సందర్బగా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తో పాటు బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి,పిఎసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, కౌన్సిలర్ పంబళ్ళ రాంచందర్,కుమ్మరి నాగేశ్, అంజనేయులుగౌడ్, శివగౌడ్,కృష్ణ,నర్సింలు, రాజు,నాగభూషణం, సైఫ్ అలీ తదితర నాయకులు, కార్యకర్తలు నల్గొండ కు తరిలి వెళ్ళిన వారిలో ఉన్నారు.



నల్గొండ బహిరంగ సభకు తరిలి వెళుతున్న బిఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న రామాయంపేట సీఐ వెంకటేష్

## రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన అవసరం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త:** రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన అవసరం రామాయంపేట సీఐ వెంకటేష్ సూచించారు. మంగళవారం చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు కచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని వాహనాలను నడపాలన్నారు. ద్విచక్రవాహనాలపై ప్రయాణించెటప్పుడు హెల్మేట్ ధరించాలని తెలిపారు. టీనేజీలో విద్యార్థులు ఉత్సాహంతో వాహనాలను నడిపితే ప్రమాదంతో అంగవైకల్యంతో బాధ పడాల్సి వస్తుందన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. విద్యార్థులు ఆడవారి పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని, ఇబ్బందులకు గురిచేస్తే మీ జీవితం జైలు పాలవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ నారాయణ, కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర, పోలీసులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కంటి చూపు మెరుగ్గా ఉండాలంటే టీకా తప్పనిసరి



పిల్లలకు విటమిన్-ఎ టికాను వేస్తున్న వైద్యాధికారి సాయి సింధూ

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త:** పిల్లల కంటి చూపు మెరుగ్గా ఉండాలంటే టీకాను వేయించాలని మండల వైద్యాధికారి సాయిసింధూ తెలిపారు. మంగళవారం పట్టణంలోని అంగన్‌వాడి కేంద్రంలోని విటమిన్-ఏ టీకాలను వేసి మాట్లాడారు. పౌష్టిక ఆహారాన్ని సేవించడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతందన్నారు. 5 సంవత్సరాలలోపుపిల్లలకు కంటి సమస్యలు రాకుండా విటమిన్-ఎ టీకాను అందిస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామాలలో పిల్లలను గుర్తించి ఈ టీకాను వేయనున్నట్లు ఆమె తెలిపారు.

## అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

**హత్నూర ఫిబ్రవరి 13: ప్రభాతవార్త:** అగ్నిప్రమాద బాదితులను ప్రభుత్వం ఆదుకోవాలని బిఎస్పీ మెదక్‌జిల్లా అధ్యక్షులు కుతాడి నర్సింలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హత్నూర మండలం మాదారం గ్రామానికి వెళ్లి అగ్నిప్రమాద బాధితులను పరామర్శించారు.ఘటన దురదృష్టకరమని అన్నారు. బాదితులు కట్టుబట్టలతో మిగిలారని వారికి తక్షణ ఆర్థిక సహాయంగా 5లక్షలు నగదుతో పాటు, ఇల్లు నిర్మాణంకు ఐదులక్షలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్యాస్‌సిలండర్‌పేలి పూరిల్లి దగ్ధం అయిన తీరును తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాలలో గ్యాస్‌సిలిండర్ ప్రమాదాలు నివారణకు ఆవగాహణ కార్యాక్రమాలు నిర్వహించాలని సూచించారు. బిఎస్పీ అధ్యక్షులు నర్సింలుతోపాటు నియోజకవర్గం అధ్యక్షులు జనార్ధన్‌గౌడ్, నాయకులు శాంతకుమార్, శ్రీధర్, పవన్ కళ్యాణ్, పవన్‌కుమార్, రవిగౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బాదితులను పరామర్శిస్తున్న బిఎస్పీ నాయకులు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

**జోగిపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని అన్నాసాగర్ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన నాగిని లక్ష్మయ్య జోగిపేట మీదుగా ముస్లాపూర్‌కు వెళ్తుండగా అన్నాసాగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న బస్సుఢీ కొట్టడంతో, బైకుపై వెళ్తున్న లక్ష్మయ్యకు కాలు విరగటంతోపాటుగా తలకు తీవ్రగాయలయ్యాయి. కాగా అతనిని వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జోగిపేట ఎస్ఐ అరున్‌కుమార్ తెలపారు.



వార్షిక ఉత్సవాలకు ముస్తాబైన అయ్యప్పస్వామి దేవాలయం

## నేటినుండి అయ్యప్పస్వామి దేవాలయం దశమ వార్షికోత్సవాలు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :**

నేడు వసంతపంచమి 14వ తేది బుధవారం నుండి, రథసప్తమి 16వ తేది శుక్రవారం వరకు రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై వెలసిన శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం దశమ వార్షికోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేద పండితులు ధర్మారం రాజు పంతులు ఆధ్వర్యంలో, ఆలయ పూజారులు కపిల్‌శర్మ, అమిత్‌శర్మల పర్యవేక్షణలో ఈ పూజా కార్యక్రమాలు జరగనున్నట్లు ఆలయ గురుస్వామి, మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ తెలిపారు. తేది 14.2.24 మాఘ శుద్ధ పంచమి బుధవారము రోజున ఉదయం 6 గంటలకు శాంతిపాఠం, గణపతిపూజ, స్వస్తివాచనం, ఋుత్విగ్వరణము, సర్వతోభద్ర మండలప పూజలు, హోమాలు, మాలమంత్ర హవనాలు, మధ్యాహ్నం 12.05 గంటలకు ధ్వజస్తంభ యంత్రప్రతిష్ఠ, సాయంత్రం 6 గంటలకు ప్రదోషకాల మండప పూజలు, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ. తేది 15.2.24 మాఘ శుద్ధ షష్టి గురువారము రోజున ఉదయం 8 గంటలకు ప్రాతఃకాల మండపపూజలు, ఆవాహిత దేవతా హోమాలు, మూలమంత్ర హవనాలు, సాయంత్రం 6 గంటలకు ప్రదోషకాల మండపపూజలు, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాదవితరణ. తేది 16.2.24 మాఘ శుద్ధ సప్తమి శుక్రవారం రోజున ఉదయం 7 గంటలకు ప్రాతఃకాల మండప పూజలు, హవనాలు, అరుణాపారాయణము, 108 కళశాలచే దేవతామూర్తులకు అభిషేకం, దిన్నబలి, మహదాశీర్వాదం, ఆవాహిత దేవతా ఉద్వాసన, తీర్థప్రసాద వితరణ తో ముగుస్తుందని వివరించారు. కార్యక్రమాలు నిర్వహించే మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## పత్తి కొనుగోలులో అధికారుల చేతివాటం

### దళారుల ఇష్టారాజ్యం

**కంగ్టి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎన్కెమూరి పత్తి కాటన్‌మిల్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రంలో యాజమాని రామకృష్ణ, సిబ్బంది మోహన్, ఇంఛార్జి సుభాని, రఫి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు కాటన్‌మిల్ ముందు తమ గోడును వెళ్లబోసుకున్నారు. రైతులకు ప్రభుత్వం అందుబాటులో ఉండి మద్దతు ధర చెల్లించాలని చెప్పినా కంగ్టిమండలంలో పత్తి కాటన్ మిల్‌ల యజమానులు తమ చేతి వాటం చూపిస్తున్నారు. పత్తి కొనుగోలు చేసే ధర్మా ఖాట తూకంలో యాజమాన్యం చేతి వాటం, ప్రైవేట్ వ్యక్తులే ఇష్టారాజ్యంగా ప్రదర్శిస్తున్నారని మంగళవారం కాటన్‌మిల్ ముందు రైతులు ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొందన్నారు.గతంలో పత్తి కొనుగోలు కేంద్రంలో రైతులకు క్వింటాలుకు రూ.7020 ఉండగా పత్తి మోచర్‌ను 18శాతం ఉండగా ఒక నెల నుంచి దానికి రూ.60920కి తగ్గించారు. క్వింటాలుకు సుమారుగా రూ.100 తక్కువగా బిల్లులు చేయడంతో తాము తీవ్రంగా నష్టపో వాల్సి వస్తోందన్నారు. సీసీఐ మోచర్, సుభాని, రఫి, మోహన్‌లు తమ ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని వీరిపై కలెక్టరు చర్యలు తీసుకుని న్యాయం జరిగేలా చూడాలని కంగ్టి మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

## నేడు సిద్ధివినాయక ఆలయంలో అక్షరాభ్యాసం

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** అక్షర స్వరూపిణి సర్వసతి మాత జయంతిని పురస్కరించుకుని బుధవారం నిర్వహించే వసంతి పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులోని స్వయంభూవు సిద్దివినాయక ఆలయంలో చిన్నారులకు అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు పేర్కొన్నారు. ఉదయం 9.32 నిమిషాలకు ఆలయంలో పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరభ్యాసం చేయించడం జరగుతుందన్నారు.చిన్నారులకు పలకలు, బలపం, పూజా సామాగ్రిని దేవస్థానం తరపున అందించడం జరగుతుందని పేర్కొన్నారు. ప్రథమ పూజలందుకునే పార్వతీ దేవి తనయుడు విఘ్నేశ్వరుడి సన్నిదిలో జ్ఞానాన్ని ప్రసాదించే సరస్వతి మాతలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటి నిర్వాహకులు పేర్కొన్నారు.

## టేక్మాల్‌లో హజరత్ షాహిద్ దర్గా ఉర్స్ ఉత్సవాలు

**టేక్మాల్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** నేడు(బుధవారం) టేక్మాల్‌లో హజరత్ షాహిద్ దర్గా ఉర్స్ ఉత్సవాలు పీంఠాధిపతి సయ్యద్‌షా అహ్మద్ నూరుల్లా హసేని ఖాద్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భగవంతుని దృష్టిలో మానవులు అందరూ సమానులే అని ఆయన చాటి చెప్పారన్నారు. ఈనెల 13,14,15వ తేదీల్లో టేక్మాల్ దర్గా ఆశ్రమంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని దర్గాను విద్యుత్ కాంతులతో అలంకరించారు.ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని నాయకులు మజర్, సలీం కోరారు.

## మండల నూతన ఎంపీడీవోగా జగదీశ్వర్ చారి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండల నూతన ఎంపీడీవోగా జగదీశ్వర్ చారి మంగళవారం నాడు బాధ్యతలు చేపట్టారు. నిజాంపేట మండలం నుండి ఇక్కడికి బదలిపై రాగా, ఇక్కడ విధులు నిర్వహించిన ప్రవీణ్ బదిలీపై నిజామాబాద్‌కు వెళ్లారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని, గ్రామాలభివృద్దే ధ్యేయంగా పనిచేస్తానని ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.